# పుష్కరం - ప్రభాకరం

ఆఫీసు పనిలో పూర్తిగా నిమగ్నుడు కావటంవల్ల మధ్యాహ్నం మూడు గంటలు దాటినా కాఫీకి బయలుదేరలేదు ప్రభాకరం. కాని కడుపులో కొంచెం కలవరం బయలుదేరగానే టైముకోసం ఎదురుగానున్న గోడగడియారం చూశాడు. దాని ప్రకారం టైం పదకొండు గంటల పదిహేను నిముషాలుమాత్రం అయ్యింది. అక్కడితో రెండు ముళ్ళూ సమ్మె చేశాయి అతనికి నవ్వొచ్చింది. పాపం! అది ఎంత కాలంనించి ఈ ఆఫీసులో పడివుందో! దాని బాగోగులు చూసే ఆఫీసరే లేడు అయినా ఆఫీసరుకు ఇందులో టైము చూసుకోవలసిన అగత్యం ఏం వుంది గనుక!- షుమారు ఏ నాలుగంటలకో షికారువచ్చినట్లు వచ్చి, తనకొరకు ప్రత్యేకించబడిన గదిలో కూర్చొని ఏవో నాల్గు సంతకాలు చేసిపోతూ ఉంటాడు.

"ఏమోయ్! పనిలో మునిగి, నిద్రాహారాలు మాని వాయుభక్షణ చేస్తావా? ఏమిటి?" అని ప్రక్కసీటులోఉన్న తోటి గుమస్తా మధు ప్రశ్నించగానే,

"టైం తెలియలేదు; ఎవరేనా అడిగితే ఇప్పుడే కాఫీ త్రాగటానికి వెళ్ళానని చెప్పు!" అని బయలుదేరాడు ప్రభాకరం.

"మరేం ఫర్వాలేదు - నెమ్మదిగా కాఫీ త్రాగి రా. ఈ గడియారాన్ని నమ్ముకుంటే తిన్నగా తీసుకువెళ్ళి గోదావరిలో ముంచుతుంది. దాని ఉపయోగం మన మేనేజరుగారికి మాత్రమే. దాన్ని పుష్కరం ఎగ్జిబిషన్‌లో పెట్టి - వచ్చిన డబ్బుతో అయినా బాగుచేయించాలి" అని ఓ చణుకు విసిరాడు మధు.

"దాని ఉపయోగం మన మేనేజరుగారికి మాత్రమే!" అనగానే చుట్టూఉన్న గుమస్తాలంతా నవ్వారు. దానికి కారణం ఉంది.

వెనక ఒకసారి మేనేజరు గడియారం ఆగిపోయిన సంగతి గుర్తించకుండా, మధుని- సరిగ్గా పదకొండు గంటలకి వచ్చినా-"పదిహేను నిముషాలు లేటుగా వచ్చావు. లేటు మార్కు చేస్తాను" అన్నాడు.

"నా వాచీలో సరిగ్గా పదకొండుగంటలు అయ్యింది. ఇది రేడియో టైమ్ ప్రకారం తిరుగుతోంది" అన్నాడు మధు. అందరిలోకి ధైర్యంగా మాట్లాడేవాడు మధు ఒక్కడే.

"రేడియో టైమ్-రైల్వే టైమ్ ఎవరిక్కావాలి-ఆఫీసు టైం ప్రకారం మార్కుకో. అందరూ కాస్త ముందు రావటంలా?' అని- ఇంకా కోపం తీరక ఆఫీసరుతో రిపోర్టు చేశాడు. ఆఫీసరు మధుని పిలిపించి- "ఏమోయ్ ఆలస్యంగా రావటమే కాకుండా, మేనేజరుని ఎదిరిస్తావా?" అని

## రాజవరపు పార్థసారథి


అడిగాడు. అప్పుడు మధు "ఒక్క నిమిషం తమరు ఒకసారి హాలులోకి దయచెయ్యండి" అని వినయపూర్వకంగా కోరి, ఆఫీసరుని తీసుకువచ్చి గడియారం చూపెట్టాడు.

ఆఫీసరు నవ్వుకున్నాడు.

"ఇది ఏ రాత్రో ఆగిపోయి వుంటుందండి. అది చూడకుండా అనవసరంగా నన్ను అంటే ఎల్లాగ?" అన్నాడు. మేనేజరు కోపంతో బంట్రోతు సన్యాసిని పిలిచి-కీ ఇవ్వమన్నాడు. గడియారం ముళ్ళు బాగా కదలటం మొదలెట్టాయి...రెండో రోజున సరిగా అదే టైము దగ్గర ఆగిపోయింది. మధు మేనేజరుకు చూపించి "మన గడియారంలో ప్రత్యేకత చూశారా?" అన్నాడు. ఆ రోజునించీ మధు అంటే లోపల కొంచెం మంటగా ఉన్నా పైకి ఏమన డానికి జంకుతాడు.

అసలు మధు దగ్గర వున్న విశేషమే అది. ఎంత పనివున్నా కంగారు పడడు. ఇంట్లో ఏమీ లోటు లేనట్లు హాయిగా కబుర్లు చెబుతాడు. ప్రపంచంలో కల్లా సుఖంగావున్నవాడిలా వుంటాడు. మరి తను అల్లాగ కాదు ప్రతిదానికీ బాధపడతాడు. ఎంత ప్రయత్నించినా తనస్వభావం మార్చుకోలేకపోతున్నాడు.

ఇల్లాగ ఆలోచిస్తూ-దగ్గరలోవున్న హోటలులో కాఫీ త్రాగుతుండగా - "హల్లో!" అని ఎవరో భుజంమీద చెయ్యివెయ్యటంతో వెనక్కు తిరిగాడు. ఫుల్‌సూట్‌లో



తన మిత్రుడు సత్యం. కళల్ప్రశ్నలు విన తర్వాత-అమెరికా రిసెర్చి ఇన్‌స్టిట్యూట్లో సీటు వచ్చినట్లూ-ప్రభుత్వం పంపుతున్నట్లు-వచ్చేనెల మొదటివారంలో ప్రయాణం అనీ చెప్పాడు. ఇద్దరు విడిపోతుండగా - సత్యం అన్నాడు "ప్రభాకరం! అన్నట్టు వొక విషయం జ్ఞాపకం వచ్చింది. రేపు వచ్చే గోదావరి పుష్కరాలకు మా-అమ్మ వస్తానంటోంది. నువ్వున్నావుగా! శ్రమ అనుకోకపోతే పుష్కరాలకి మీ ఇంటికి పంపుతాను, నాకు ప్రయాణం వుంది. ఆమెకు తోడు ఎవరూ ఉండరు; అందుకు. లేకపోతే నీకు ఈ శ్రమ ఇవ్వను."

"ఓ! అంతకంటేనా! తప్పకుండా పంపు" అన్నాడు ప్రభాకరం.

తిరిగి ఆఫీసుకి వచ్చేసరికి "నీకు ఉత్తరాలు వచ్చాయి" అని రెండుకవర్లూ, వొక కార్డు ఇచ్చాడు మధు. ప్రభాకరం ఆశ్చర్యపోయాడు. తను ఉద్యోగంలో చేరి రెండు సంవత్సరాలు దాటినా-మచ్చుకి ఒక ఉత్తరమున్నా ఆఫీసుకి రాలేదు. తనూ వ్రాయటము మానుకున్నాడు. ఎప్పుడైనా వస్తే ముఖ్యులదగ్గరనుంచి ఇంటికే వచ్చేవి. తరుచు ప్రతివాళ్ళు ప్రత్యక్షంగా కలుసుకుంటున్నప్పుడు-పరోక్షంగా ఉత్తరాలు వ్రాయవలసిన అవసరం ఏమిటి? మొదట కార్డు చదువుదామని ఉపక్రమించాడు. ఎవరు వ్రాశారోగాని కార్డువిలువ పూర్తిగా వినియోగించుకున్నారు. ఉత్తరం చూస్తే విజయనగరం నుంచి వచ్చింది. తనకు తెలిసినంతమటుకు విజయనగరంలో ఎవరూ లేరు. ఎడ్రసు సరిగ్గా తనదే. చదవటం మొదలెట్టాడు.

"చి॥ ప్రభాకరం అల్లుడిని దీవించి మీ అత్తయ్య వ్రాయునది—


క్షేమం. అచట నీవు, అమ్మాయి కులాసాగా ఉన్నారని తలచెదను. మీ అమ్మ పోయిన సంగతి తెలుసుకొని చాలా విచారించినాను. మీ నాన్న పోయినదగ్గరనించీ-జాగ్రత్తగా కంటికి రెప్పలా కాపాడుతూ పెంచుతూ వచ్చింది ఆమెకూడా పోవటం నీ దురదృష్టం. నీ చిన్నతనంలో నన్ను చూశావు. బహుశా, అంత గుర్తుండక పోవచ్చు. అస్తమానూ వచ్చి పోతుంటేనే బంధుత్వాలు. మీ నాన్న పెదతండ్రి—మా నాన్న తోడిఅల్లుళ్ళు. చిన్నప్పుడు మీ నాన్న—మేము అంతా ఆడుకొనే వాళ్ళం. నీకు వివాహం అవటం—ఉద్యోగంలో చేరటం-మొదలయిన విశేషాలు-వ్యాపారరీత్యా మీ రాజమండ్రి వచ్చిన పన్నయ్యద్వారా తెలుసుకొన్నాను. నిన్ను చూడాలని వుంది. కొత్తకాపురం కష్టమే. గోదావరి పుష్కరాలు ఇక వారమేగా వుంట. తప్పకుండా వస్తాను.

గ్రహించవలెను,
సత్తెమ్మ వ్రాలు"

ఎవరో ఈ సత్తెమ్మ మొదట అర్థం కాలేదు. తరువాత బాగా ఆలోచించగా అమ్మ ఏదోసందర్భంలో అన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి. "విజయనగరంలో సత్తెమ్మ అని ఉంది. అస్తమానూ డబ్బు కావలిస్తే-మీ నాన్న దగ్గరకి వచ్చి తీసుకుపోయేది. పరమ కిరాతకురాలు. సుమారు వెయ్యి రూపాయలువరకూ బాకీవుంది. మీ పెదనాన్న "దానికి డబ్బు ఇవ్వద్దు" అంటే—మీ నాన్నకు, పెదనాన్నకు దెబ్బలాట పెట్టింది అదే!—అన్నదమ్ములకి, తండ్రి కొడుకులకి గృహంలోనే కలహాలుపెట్టి ఆనందిస్తుంది. దాని కళ్లుపడిన కాపురం ఒక్కటీ బాగుపడలేదు. ఎప్పుడైనా అలాంటివాళ్లు నీ జీవితంలో తటస్థపడితే - చాలా జాగ్రత్తగా ఉండు."

దాని స్వభావం ఆ ఉత్తరం చదివితేనే తెలుస్తుంది-అనుకున్నాడు.

తరువాత ఒకకవరు విప్పాడు. అది తన పెదతండ్రి కొడుకు సుబ్రహ్మణ్యందగ్గరనించి వచ్చింది. వాడు చాలదూరంగా రైల్వేలో పనిచేస్తున్నాడు. చిన్నప్పుడు ఇద్దరూ ఒక కంచంలోతిని, ఒకేచోట చదువుకునేవారు. గోదావరిపుష్కరాలకి వస్తానని వ్రాశాడు. ఎన్నిసార్లు రమ్మనివ్రాసినా శెలవు దొరకదు అనేవాడు. పోనీ పుష్కరాల ధర్మమా అని అయినా కలుసుకోవచ్చు.



# ★ పుష్కరం - ప్రభాకరం ★

ఇంకో కబురు చెప్పాడు. అది తన అక్కయ్య శ్యామల వ్రాసింది.

"చి॥ ప్రభాకరం తమ్ముడికి దీవించి
వ్రాయునది—

ఇచట అంతా క్షేమం. అచట నీవు, వదిన కులాసాగా ఉన్నారని తలుస్తాను. ఈమధ్య నీదగ్గరనించి అసలు ఉత్తరములు లేవు. మీ బావగారిని వ్రాయమంటె — ఆయనకు శ్రద్ధ తక్కువ. మిమ్మల్ని చూసి చాలా కాలమయింది. గోదావరి పుష్కరాలకి వద్దామని వుంది. మళ్లీ పుష్కరాలకి ఎల్లాగ ఉంటామో? "డబ్బు దండుగ ఎందుకూ?" అని మీ బావగారు అంటున్నారు. నువ్వు రాజమండ్రిలో ఉంటున్నావు గనుక, పరోక్షప్రాలిలో రాజమండ్రికీ, గోదావరికి దూరంగా ఉంటే — చూసేదిలేదు, "మీ తమ్ముడు తీసుకువస్తే నా అభ్యంతరం లేదు" అంటున్నారు. గనుక, నువ్వు ఒక యాభైరూపాయలు పంపవలెను. పుష్కరాలకి నేను, పిల్లలూ వస్తాము. బావకు తప్పకుండా ఉత్తరము వ్రాయవలెను.

నీ అక్కయ్య
శ్యామల."

ఒక పెద్దనిట్టూర్పువిడిచి, అవును! నాన్నగారుంటే అక్కయ్యకు అన్ని ముచ్చట్లు తీరేవి. పాపం! కాపురానికి వెళ్లిన తరువాత ఎప్పుడూ డబ్బు అడగనేలేదు. బావ చాలా మంచివాడు. డబ్బున్నవాళ్లే అయినా, అంత ప్రేమగా, అత్తవారిని డబ్బు అడగనివాళ్లు ఎవరు ఉంటారు. ఇప్పుడేనా డబ్బు పంపకపోతే - తన బ్రతుకు నిష్ప్రయోజనం. కాని డబ్బు ఎక్కడిది? వచ్చేజీతమే దిక్కు. "మళ్ళీ పుష్కరాలకి ఎల్లాగ ఉంటామో" ఆమాటలు ములుకుల్లా గుచ్చుకుంటున్నాయి. ఎల్లాగ అయినా పంపాలి అనుకున్నాడు. మతిపోయినట్లయింది. ప్రొద్దుట ఆఫీసుకు వచ్చేటప్పుడు "బొగ్గులు అయిపోయాయి. కొన్ని సరకులు నిండుకున్నాయి. సాయంత్రం పెందరాళే రండి!" అన్న పద్మమాటలు జ్ఞప్తికి వచ్చాయి.

సాయంత్రం కాగానే ఆఫీసునించి ఇంటికి బయలుదేరాడు. బుర్రలో ఆలోచనలు తిరుగుతున్నాయి. ఇంటికి సరుకులు తీసుకువెళ్లాలి. బొగ్గులు లేకపోతే వంట ఎల్లాగ చేస్తుంది? ఇంకా పది రోజులు గడిస్తేనే కాని జీతాలు అందవు. ఈ పట్టణంలో డబ్బు అప్పు ఎవరు ఇస్తారు? ఏ కేనా వస్తువు తాకట్టు పెడితేనేగాని-మనిషి విలువనుబట్టి ఎవరూ ఇవ్వరు. తాకట్టు అనగానే పద్మ వంటినిండా నగలతో చిరునవ్వు నవ్వుతూ ఒక మెరపులా మెరిసింది. ఛ! అంత నీచపు పనికి ఒడిగట్టను. పాపం: అవసర మొచ్చినప్పుడు మధు సహాయం చేస్తున్నాడు. మొన్ననేగా పదిహేను రూపాయిలు అతని దగ్గర పుచ్చుకుంట. అతనికి మాత్రం ఎక్కడినించి వస్తుంది?

తన చేతివాచీ ఇచ్చి అమ్మి పెట్టమన్న వాచీడీలరు రత్నం మెదడులో మెదిలాడు. అదృష్టం వుంటే ఈ పాటికి అమ్మి ఉండవచ్చు. అసలు డబ్బు లేకపోవటంవల్ల మరో దారి తోచక—పద్మ ముచ్చటతో కొని పెట్టిన వాచీ అమ్మడానికిచ్చాడు. వాచీ లేకపోవటం వల్ల-గోడ గడియారం చూసుకోవలసిన గతి పట్టింది. కాని అమ్మక తప్పదు. తిన్నగా రత్నం వాచీ హాస్పిటల్ దగ్గరకి బయలుదేరాడు. ఆలోచనలు ఒకదానివెంట మరొకటి తరంగాల్లా వస్తున్నాయి.

అదేం ఖర్మమోగాని — తను రాజమండ్రిలో కాపురంపెట్టిన దగ్గరనుంచి, అతిథిలేకుండా (చుట్టం) ఒక్క పూటకూడా భోజనం చెయ్యలేదు. రాజమండ్రికి అతి ప్రాముఖ్యత వుందికదూ ?-వాణిజ్యకేంద్రం. ఏదోపనిమీదవచ్చి "కులాసాగా ఉన్నావా! చూపటానికి వచ్చాను." అని భోజనం చేసిపోతూ వుంటారు. కావలసినవాడు ఒక్కడు కాడు. తన చుట్టాలపేరు, తండ్రిపేరు, తల్లి పేరు చెప్పి, "మీది ఎలాంటి కుటుంబం! మీ నాన్న ఎంతటి మహానుభావులు." అని ఏదో పొగిడి భోంచేసి వెళ్లిపోతారు. ఎప్పటికప్పుడు కతినంగా, నిర్మొహమాటంగా ప్రవర్తించాలని అనుకుంటాడు. కాస్త భోజనం అయినా చెయ్యమనకుండా ఎలా వుండగలడు. అనడం తడవు వాళ్లు తిష్ట వేస్తారు.


పెళ్ళి అయిన కొత్తకాపురం. చక్కగా పద్మ తనూ, హాయిగా రోజులు గడుపుతూ, తీయని తలపులతో, ఏవో లోకాలోకి తేలిపోదాం అనుకున్నాడు. గొప్పవాళ్ళకి మల్లే "హనీ-మూన్"కి ఎక్కడికి పోకపోయినా- ఉన్నచోట అయినా అనుభవిద్దామని అనుకున్నాడు. తనకీ భార్యకీ అయితే వచ్చే జీతం సరిపోగా, ఇంకా మిగులుతుంది కూడా. కాని చుట్టాలమూలంగా, ఏదో పెద్ద కుటుంబం వున్నవాడిలా అప్పులు చేస్తూ బాధపడవలసివస్తోంది.

అల్లంతదూరంలో ఏదోగుంపు కనబడింది. చూస్తే అది నాలుగురోడ్ల జంక్షన్. ఒక మోటారు, సిటీబస్ కూడా ఆగిపోయాయి. ఏదో ప్రమాదం జరిగింది. అయినా ఇంత జనసమ్మర్ధంగల ఇరుకు రోడ్డమీద అంత వేగంగా నడపటం ఏం పొగరు? అనుకుంటూ వెళ్ళేసరికి ఒక బట్టతల ఆసామీ, గిరజాల జుట్టూ గళ్ళలుంగీ గల మరొక ఆసామీ హోరాహోరీ పోట్లాడుకుంటున్నారు. కొంతమంది విడదీస్తున్నారు. విడదీసినకొద్దీ పుంజుల్లా ఎగిరెగిరి పడుతున్నారు. కొంత మంది నవ్వుతున్నారు. కేవలం కాలి బొటన వేళ్ళపై నుంచొని, ఇంకొకటి. భుజంమీద చెయ్యివేసి ఆతురతగా చూస్తున్న ఒక ఆసామిని—

"ఈ గలభాకు కారణం ఏమిటి?" అని అడిగాడు ప్రభాకరం.

"ఆ! ఏమీ లేదండి. అదిగో ఆ బట్టతల యన అంటాడు ఫలానా తారీఖునించి గోదావరి పుష్కరాలు మొదలు అని. గిరజాల జుట్టువాడు అంటాడు. "ఛ! అది తప్పు—

బొల్లి
మహాపాడ సమస్త చర్మవ్యాధులకు అమోఘ చికిత్స
క్యాటలాగు సెలవు పుచితం
జి.వి.రెడ్డి&కో రిజిష్టర్డ్
భాస్కరాశ్రమము గోపాలపురం తూర్పుగోదావరిజిల్లా

ఫిలిప్స్
★
BCA - 345 U/B
కరెంటులేక డ్రైబ్యాటరీ రేడియో
ధర: రు. 295/-

PHILIPS
మోడరన్ ఆటో స్టోర్సు, విజయవాడ-1.

"ఈ పంచాంగం ప్రకారం ఈ తారీఖునించి-" అని నీ పంచాంగం తప్పు అంటే నీదే తప్పు అనీ - అది వ్రాసినవాడికేం తెలుసు. అంటే అది వ్రాసినవాడికేం తెలుసు అనీ-చివరికి పంచాంగకర్తలని దూషిస్తూ - కొట్టుకోడం లోకి దిగారు" అన్నాడు.

"హు! పుష్కరాల ప్రచారం" అనుకొని కనుదిరిగాడు. వాచీషాపు దగ్గరకు వెళ్ళగానే రత్నం అన్నాడు,

"ఎవరూ రాలేదండి. మీకు అంతగా డబ్బు అవసరముంటే నలభైరూపాయలు ఇస్తాను, ఇచ్చేయండి. అంతకంటే ఎక్కువ రాదు కూడా. కొన్ని పార్టులు అరిగిపోయాయి." అన్నాడు. అందర్లోకి నమ్మకస్తుడు కదా అని ఇచ్చాడు పార్టులు అరిగిపోయాయిట. నూటఇరవై రూపాయలు ఖరీదైన వాచీకి, నలభైరూపాయలు ఇస్తాడా? ఎప్పుడూ వాచీ రిపేరుకికూడా ఇవ్వలేదు. పార్టులు రిప్లేస్ చేసివాడేస్తాడు. "అక్కర్లేదు!" అని వాచి తీసుకున్నాడు. తన ఆఫీసులో రత్నానికి ఒక ఉపకారం చెయ్యవలసివుంటే చేశాడు. ఆమాత్రం అభిమానమయినా లేదు. వ్యాపారలక్షణం. పోగట్టుకోలేదు, అనుకొని తిన్నగా ఇంటికి వచ్చేశాడు.

"పద్మ! ఏముంటుందో. సరుకులు కూడా తేవాలి. పెందరాళే రమ్మంది." అని భయంగా అడుగులు వేసుకుంటూ వచ్చాడు. పద్మ తను అనుకున్నట్టు లేదు. సంతోషంగా గుమ్మందగ్గర ఎదురుచూస్తోంది. ప్రభాకరానికి కోపంవచ్చింది. ఇంట్లో ఏమీ లేకపోయినా, తను డబ్బుకి ఇంత ఇబ్బంది పడుతున్నా ఏమీ పట్టనట్లు-చక్కగా చీర సింగారించుకొని, తల్లో పువ్వులు తురుముకొని ఎదురుచూస్తోంది. వెంటనే తనను తాను నిందించుకున్నాడు. "సంతోషంగా ఉన్న భార్యను సంతోష పెట్టమింపోయి— కోపం తెచ్చుకోడానికి కారణం డబ్బులేకపోవడంకదా?" అనుకున్నాడు. తిన్నగా వెళ్ళి పడకకుర్చీలో జార్లబడి "ఏమిటి సంగతి?" అని అడిగాడు.

పద్మ ప్లాస్కులో కాఫీ పట్టుకువచ్చి "ఇవేళేమిటి పెందరాళె రావడం?" అని "దానికేంగాని— మీకో మంచి విషయం చెప్పనా?" "ఏమిటి?" అని ఆత్రంగా అడిగాడు. "ఈవేళ మాఅక్కయ్య సులోచన దగ్గరనించి ఉత్తరం వచ్చింది!" "ఏమని?- కొంపతీసి పుష్కరాలకి వస్తానని వ్రాసిందా?" "ఏం! రాకూడదా? అయినా మీకు ఎల్లాగ తెలిసింది?" "ఇదిగో" అని జేబులో ఉత్తరాలు మూడు ఇచ్చాడు ప్రభాకరం. ఆమె చదవటం మొదలెట్టింది.

అతను ఆలోచించడం మొదలెట్టాడు— సులోచన పేరు ఎత్తగానే ప్రభాకరం ఏకోలోకంలోకి పోయాడు. పాతస్మృతులు జ్ఞప్తికి వచ్చాయి. సులోచన కళ్ళల్లోకి చూస్తే—కదలనిలోతునీళ్ళలోకి తొంగిచూసినట్లుంటుంది. ఆమె కళ్ళకేసి చూస్తుంటే యుగాలు గడిచిపోతాయి ఆమె అందం అంతా అక్కడే ఉంది. దానికి తగినట్లు మంచి అంగసౌష్ఠవం. పద్మకంటె అయిదు సంవత్సరాలు పెద్ద. ఇద్దరుపిల్లల్ని కన్నా కన్నెపడుచులా ఉంటుంది. చలాకీగాను, గంభీరంగాను ఉంటుంది. కాని మగడుమాత్రం "ముష్టిఘాతంబులన్— బాహుదండంబులవే" అంటూ ఉంటాడు. ముఖంలో కళలేకపోయినా—కండలు గల మనిషే. తనకంటూ నియమే— మేస్త్రీ గనక ప్రయివేట్లవలన సంపాదిస్తాడు. ఆమె ఎంత చలాకీగా హుషారుగా ఉంటుందో అతివంత నెమ్మది. భగవంతుడు ఎల్లాగ పరిపెట్టాడో- ఆమె, తనకి పద్మతో పెళ్ళిఅయిన కొత్తలో ఎన్నో వేళాకోళాలు ఆడేది. ఆమె కళ్ళతో తనకేసి చూస్తుంటే—ఎందుకో అప్పుడు సిగ్గుచేత బుర్రవంచుకునేవాడు. "ఛ ఇవేం ఆలోచనలు—పాడు ఆలోచనలు—అనుకున్నాడు :

"అయితే మా అక్కయ్య రావడం మీకు ఇష్టంలేదా?" అని అడిగింది పద్మ.

"ఛ; ఛ; అల్లాగ అంటానా—కాని ఖర్చు ఎల్లాగ భరించడం?"

"మీరు తలుచుకొంటే అదెంతపని !"

"ఆ ఆ!! అస్తమానూ తలుచుకొంటునే ఉన్నా—దమ్మిడీ కూడా ఎక్కడా అప్పు పుట్టటంలేదు వచ్చేరాబడి కనబడదు."

"సరేగాని భోజనానికి లేవండి."

"భోజనమా?— బొగులు, సరుకులు లేవన్నావుగా!"

"బాగుంది! ఏమీ లేకపోతే! కాళ్ళు చాచుకుని కూర్చుంటానా!"

భోజనంచేసి కిళ్లీ వేసుకుందామని జంక్షన్ దగ్గర పల్లయ్య కిళ్లీబడ్డీ దగ్గరకు వెళ్ళాడు. ఆశ్చర్యం! ఎంతమార్పు! పల్లయ్య కిళ్లీకొట్టు పాలింతలు విడల్పు చేశాడు. సోడాలకి డ్రింకులకి వేరు, చుట్టలు చుట్టడానికి ప్రత్యేకం బడ్డీ, సిగరెటుకి బీడీలకి వేరు, కిళ్లీలకి వేరు—నాలుగు భాగాలుగా చేసి పెద్దదుకాణంలా తయారుచేశాడు. ట్యూబ్ లైట్లూ రంగురంగుల దీపాలూ అమర్చాడు. చూడటానికి కన్నులపండువుగా ఉంది.


"ఏమిటోయ్ ఇదంతా?" అని అడిగాడు ప్రభాకరం. "పుష్కరాలూ వదంటండీ- చుట్టాల కుర్రాళ్లు వచ్చారు. ఉత్తినేకూర్చో పెట్టడమెందుకు నాలుగు డబ్బులువచ్చే రోజులు— వాళ్లన్ని కొట్టులో పెట్టాను" అన్నాడు పల్లయ్య.

తనకంటె పల్లయ్య తెలివైనట్టు మెరుగు. బంధువులని పిల్చాడు. వాళ్లని ఉపయోగించుకొని, తిండిపెట్టి,తద్వారా డబ్బు సంపాదిస్తున్నాడు. తను ఉన్న కొంపకూడా అమ్మి చదువుకి ఖర్చుపెట్టాడు. కాని ఏం లాభం. డిగ్రీ పేరు చివర తగిలించుకోడానికైనా అర్హతలేని ఉద్యోగం. ఆడబ్బు పెట్టి వ్యాపారం చేసుకున్నా బాగుండేది.

ఇంటికి వచ్చి పడుకున్నాడు. కాని నిద్రపట్టలేదు. పుష్కరాలకి ఏ విధంగా ప్రభుత్వం డబ్బు ఖర్చు పెట్టుతున్నదీ, ఏర్పాట్లు జరుగుతున్నవీ తలలో మెదిలాయి. ఆరోగ్యశాఖ, రక్షణశాఖ, తంతితపాలా శాఖలలో అదనంగా సిబ్బందిని వినియోగించి పనులకు ఆటంకం కలగకుండా శ్రద్ధ తీసుకుంటున్నారు. పుణ్యక్షేత్రాలు దర్శించడం కేవలం పుణ్యం వస్తుందనికాదు. ఆ ప్రయాణాల్లో బాధలుపడి కొంత అనుభవం సంపాదించి, తోటిమానవులపై కక్షలు లేకుండా స్వర్గంలో మెలుగుతారని. పుణ్యం అని పేరు చెబితేగాని రారు పల్లెజనం. ఈ గోదావరి పుష్కరాలకి దేశం నలుమూలలనుంచీ వస్తారు. డబ్బు చాలా ఖర్చుపెడతారు. చివరకు పిడతల్లో దాచుకొన్న డబ్బుకూడా ఖర్చుపెట్టి ఇళ్లకుపోయేటప్పుడు నీరసంగా పోతారు. ప్రతి పన్నెండు సంవత్సరాలకు గోదావరి పుష్కరాలు వదిసాదుగునా జరుగుతాయి- తూర్పుగోదావరిలో రాజమండ్రి ప్రసిద్ధి.

పుష్కరాలమాట దేవుడెరుగు. రాజమండ్రిలో ప్రతివస్తువూ ప్రియం అయిపోతాయి. గిరాకీ హెచ్చిపోతుంది. ఇళ్ల అద్దెలు పెరిగిపోతాయి. జీవించడం కూడా దుస్సహంగా ఉంటుంది - మాములుగా, సామాన్యంగా నివసించేవారికి ఇల్లాగ ఎంతమంది బాధపడుతున్నారో— అక్కయ్యకి డబ్బుపంపడం ఎల్లాగ? సుబ్రహ్మణ్యం వస్తాడు. సత్యంతల్లి వస్తుంది. డబ్బుంటె బాగా గౌరవించవచ్చు. ఇప్పుడు దమ్మిడీ లేదు. ఇల్లాగ ఊరుకుంటే అభాసుకూడా జరుగుతుంది.

మర్నాడు ప్రొద్దుటే మధు ఇంటికి వెళ్ళాడు ప్రభాకరం. మధు తన పిల్లాడిని ఒళ్లో కూర్చోపెట్టుకుని కబుర్లుచెప్పుకుంటూ కాఫీ త్రాగుతున్నాడు. ఆ దృశ్యం చూసి "ఎంత అదృష్టం?" అనుకున్నాడు. ప్రభాకరాన్ని చూసి "రా!మీ అన్నయ్యకూడా కాస్త కాఫీఇయ్యి!" అన్నాడు భార్యతో మధు.



# ★ పుష్కరం - ప్రభాకరం ★

"వద్దు; ఇప్పుడే త్రాగివచ్చాను," అని ఇచ్చినకాఫీ త్రాగుతూ.

"ఓ ఇరవైరూపాయిలు కావాలి: ఉంటే ఇద్దు;" అని అడిగాడు ప్రభాకరం.

మారోమ్రాటని, మారుగింటికివెళ్ళి—కొంత సేపటికి తిరిగివచ్చి, "ఇదిగో, కొంచం జాగ్రత్తగా ఖర్చుపెట్టు" అన్నాడు మధు.

"ఏం చెయ్యను? చుట్టాలబాధ ఎక్కువగాఉంది. పుష్కరాలకి ఖర్చు ఎల్లాగో తెలియటంలేదు" అన్నాడు ప్రభాకరం.

"మొహమాటపడితే మొదటికే మోసం! నిర్మొహమాటంగా చెప్పెయ్యి, నేను చాలా ఇబ్బందిపడుతున్నానని - అల్లాగ చెప్పలేకపోతే— నీతరఫువాళ్ళు వస్తే మా ఆవిడను సాధించమను. మా ఆవిడతరఫువాళ్లు వస్తే నువ్వు సాధించడం మొదలెట్టు — ఆదెబ్బతో పారిపోతారు" అన్నాడు వేళాకోళానికి మధు.

"ఛ! అదేం! మాటలండీ!" అంది మధు భార్య.

"పోనీ: ఆ పద్ధతి బాగోకపోతే - పుష్కరాలకి ఎక్కడికేనా దూరంగా పారిపో!" అన్నాడు — హాస్యానికి మధు.

అంతా నవ్వుకున్నారు. డబ్బు అప్పిచ్చి ఆదుకొన్నందుకు కృతజ్ఞత తెల్పి - ఇంటికి బయలుదేరాడు. మధు ఆఖరున అన్నమాటలు హాస్యానికే అయినా - మంచి సలహాఇచ్చినట్లు తోచింది ప్రభాకరానికి ఎక్కడికైనా పారిపోవటంకన్నా గత్యంతరం కనబడలేదు. అవును! పుష్కరాలకి మామగారి ఇంటికి వెళ్తే—? పండుగలకి కూడా ఎప్పుడూ శెలవు దొరక్క వెళ్లడానికే పడలేదు. ఇప్పుడు ఏకొవిధంగా శెలవుపెట్టి — పుష్కరాలకి అక్కడకువెళ్లడం మంచిదని నిర్ణయించుకొని, నిర్ధారణకు వచ్చాక ఓ ఎత్తు వేశాడు. ఆ విషయంలో కొంచం ముద్దుగా పనిచేసింది బుర్ర. తిన్నగా ఆఫీసరు ఇంటికి వెళ్లి — ఇంటికి తిరిగివచ్చాడు.

"ఏమండీ: రోజూ ఈపాటికి వంట అవకపోతే రంపుకుతిసేవారు. ఈ వేళ ఆఫీసుకు వెళ్లరేమిట?" అని అడిగింది పద్మ.

"శెలవుపెట్టాను!"

"ఏం!"

"పుష్కరాలు నాల్గురోజులూ, మీ పుట్టింటిదగ్గర గడుపుదామని."

"శెలవు ఎన్నాళ్లు పెట్టారు! జ్వరం వచ్చినా శెలవుదొరకదని ఆఫీసుకి వెళ్లేవారే?"

"ముందు ఓ నాలుగు రోజులు మాత్రం పెట్టాను. అక్కడినుంచి పొడిగించవచ్చు - ఇక్కడవుంటే ఎల్లాగ — చుట్టాలువాళ్లు వస్తారు."

"బాగానే వుంది—అందరూ పుష్కరాలకి బోలెడు డబ్బు ఖర్చుపెట్టుకుని వస్తారు- మనం దూరంగా పోతున్నాం," అని "పుష్కరాలకి అన్నదానం చేస్తే చెప్పలేనంత పుణ్యం వస్తుంది" అంది పద్మ.

తన అక్కయ్యవాళ్లు వస్తారు. పుష్కరాలకి రాజమండ్రిలో గడపాలని ఉన్నా - పుట్టింటికి అనడంతో అడ్డుపెట్టకుండా ప్రయాణం కట్టేసింది. ఇద్దరూ ప్రయాణం అయ్యారు.

* * *

ఎప్పుడూ మానకుండా ఆఫీసుకు సరియైన టైముకు వచ్చే ప్రభాకరం—ఆ రోజు ఆఫీసుకు రాకపోయేటప్పటికి అందరూ ఆశ్చర్యపోయారు. అందరిలోకీ మధు ఎక్కువగా బాధపడ్డాడు, ఆప్తమిత్రుడు కావటంవల్ల. సాయంత్రం ఆఫీసు వదలగానే తిన్నగా ప్రభాకరం ఇంటికివెళ్ళి కారణం తెలుసుకోవాలి అనుకున్నాడు.

మధ్యాహ్నం ఆఫీసరు రాగానే "ఈ రోజు ప్రభాకరం—ఆఫీసుకు రాలేదు— శెలవు చీటీకూడా పంపలేదు" అని రిపోర్టు చేశాడు మేనేజరు.

"నేనే శెలవు ఇచ్చాను. ప్రొద్దుటే మా ఇంటికి వచ్చాడు. పాపం! వాళ్ల మామగారికి సీరియస్‌గా ఉందిట—చావు బ్రతుకుల మధ్య ఉన్నాడట—వెంటనే వెళ్లాలి అంటే శెలవు ఇచ్చాను—" అన్నాడు ఆఫీసరు.

ఆ సంగతి తెలుసుకొని మధు "పాపం! అతనికి అన్నీ కష్టాలే" అని లోపల సానుభూతి తెల్పాడు.

* * *

ముందు తెలియపర్చకుండా, అల్లుడూ అమ్మాయి బండి దిగటంతో రమణయ్యగారు కంగారుపడ్డారు. రమణయ్యగారు ఆ వూరికి మోతుబరి; బాగా డబ్బున్న రైతు.

"ఏమోయ్! కులాసాగా వున్నారా?"

"ఆఁ!"

"ఉద్యోగం బాగా వుందా? గొడవలు ఏమీ లేవుకద?"

"గొడవలు ఏమీ లేవు. శెలవు దొరికితే— నాల్గురోజులు విశ్రాంతి తీసుకోవచ్చని-" అన్నాడు ప్రభాకరం.

"మంచిపని చేశావు. శెలవు పెట్టికూడా అక్కడెందుకు?—అవునుగాని రాజమండ్రిలో పుష్కరానికి ఏర్పాట్లు ఏమన్నా జరుగుతున్నాయా?"

"హుఁ. రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరం తప్పదన్నట్లు" అనుకుని—"ఏవో జరుగుతున్నాయిలెండి" అన్నాడు ప్రభాకరం.

తోవలోకి వెళ్లి కూతురు పద్మవలన అసలు సంగతి, డబ్బుకి ఇబ్బందిపడుతున్నారని తెలిసి-నవ్వుకున్నాడు రమణయ్యగారు.

"పోనీ డబ్బు కావాలని వ్రాస్తే పంపనూ? అయినా అతనికి అదో పట్టుదల - నేను ఇస్తే డబ్బు పుచ్చుకోడు—పోనీలే. కట్నం ఎల్లాగూ పుచ్చుకోలేదు-అనక—ఓ వెయ్యి రూపాయలు ఇస్తాను. అవి బేంకులో వేసుకుని, అవసరముంటే తీసుకుని ఖర్చుపెట్టుకోండి. ఇబ్బంది పడక," అన్నాడు రమణయ్యగారు.

బయటకు వచ్చి—"ఏమోయ్, ప్రభాకరం— పుష్కరాలు ఎల్లుండినుంచేకదా. రేపు ప్రయాణం పెట్టుకున్నాం. రాజమండ్రి వెళ్లి మళ్ళీ వద్దాం. మా అందరికీ సంతర్పణ చేస్తే చాలాపుణ్యం" అన్నాడు రమణయ్యగారు.

"అల్లాగే వెళ్దాం!—ఎంత మాట!" అన్నాడు ప్రభాకరం.

* * *

ఆరాత్రి పద్మను అడిగాడు "ఎల్లాగ?" అని.

"పుష్కరాలకు అయ్యే ఖర్చు నేను పెట్టుకుంటాగాని—ఈ వందరూపాయలు తీసుకుని ముందు మా అక్కయ్యగారిక్కెలిగ్రాం మనిఆర్డరు చెయ్యండి, వెంటనే రమ్మని" అంది పద్మ.

* * *

శెలవు పెట్టిన మూడోరోజుకి రాజమండ్రి వచ్చేశాడు ప్రభాకరం. ఆరోజు బజారులో తనూ, మామగారూ కలసి వెళ్తూండగా, ఆఫీసరుగారు, మధు, బంట్రోతు సన్యాసి ఎదురుపడ్డారు.

"మీ మామగారికి ఎల్లాగ వుంది?" అని ఇంగ్లీషులో అడిగాడు ఆఫీసరు.

"కులాసాగానే వున్నారు. అసలు జబ్బు ఏమీ లేదు. ఎవరో కిట్టనివాళ్లు వ్రాశారంట్, ఆ వుత్తరం—నన్నుల్ని కంగారుపెట్టడానికి" అని జవాబు చెప్పాడు ప్రభాకరం

ఆఫీసరు ఇంగ్లీషులో అడిగినందుకు, గోదావరి మహాతల్లికి మనస్ఫూర్తిగా నమస్కారం చేశాడు. (రమణయ్యగారు ఇంగ్లీషు రాని మహానుభావుడు)

తరువాత మధుకి జరిగిన సంగతి యావత్తు ఏమీ దాపరికం లేకుండా చెప్పాడు.

"నీకు గోదావరిలో స్నానం చేసుకుని- పుణ్యం కట్టుకోనే వ్రాత వ్రాసివుంటే— విధివ్రాత ఎవరు తప్పిస్తారు. నువ్వు ఎంత దూరం పోయినా మళ్లీ దగ్గరకు రప్పించింది- ఆ మహాతల్లి" అన్నాడు మధు.

అప్పటినుంచీ ఎప్పుడేనా చుట్టాలెక్కువగా వచ్చినట్లు చెప్పవలసివస్తే-"పుష్కరం - ప్రభాకరం" అని నవ్వుతాడు. మన ప్రభాకరం తలవంచుకొంటాడు. ★